అరకొరగా రేషన్ పంపిణీ

- గ్రామాల్లో కార్డుదారులకు పరేషన్
- మూడు నెలలుగా కనిపించని కందిపప్పు
- పంచదార పంపిణీ అస్తవ్యస్తం



గ్రామాల్లో ఎండీయూ వాహనాల వద్ద బియ్యం మాత్రమే తీసుకుంటున్న కార్డుదారులు

కొల్లిపర: నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటిన రోజుల్లో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసే రేషను సరుకులైనా ఆదుకుంటాయని భావించే పేదలకు ఏ నెలకు ఆ నెల నిరాశే మిగులుతోంది. నెలనెలా రేషను సరుకులు వట్టిపోతున్నాయి. మూడునెలలుగా కందిపప్పు ఎండీయూ వాహనాల్లో కనిపించటం లేదు. పంచదార ఒక నెల ఇస్తుంటే మరో నెల లేదంటున్నారు. రేషను విధానం కేవలం బియ్యానికే పరిమితమైంది. దీంతో కార్డుదారులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు కందిపప్పు పంపిణీ చేస్తామని ఆర్భాటంగా ప్రకటించారు. బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రూ.180 పలుకుతోంది. ప్రభుత్వం కిలో రూ.67లకే అందిస్తామనటంతో రేషను కార్డుదారులు సంతోషించారు. మొదటి మూడు నెలలు ఎండీయూ వాహనాల ద్వారా మొదటి మూడునెలలు కందిపప్పు పంపిణీ చేశారు. అదికూడా పూర్తి స్థాయిలో కార్డుదారులకు చేరలేదు. ఒక్కో రేషను దుకాణం పరిధిలో కొద్ది శాతానికే పంపిణీ జరిగింది. ఆ తర్వాత కందిపప్పు పంపిణీ జరగటం లేదు. పంచదార కూడా ఒక నెలలో ఇస్తే మరొక నెలలో ఇవ్వక పోవటంతో పేద, మధ్య తరగతి రేషను కార్డుదారులకు దిక్కుతోచడం లేదు. ప్రతినెలా రేషన్ కార్డుదారులకు కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్న ఉచిత బియ్యం మాత్రమే అందజేస్తున్నారు. అధికారంలోకి వచ్చాక రేషను దుకాణాలతో ప్రతినెలా క్రమం తప్పకుండా అన్ని రకాల పప్పులు రాయితీ ధరలకు ఇస్తామని, సంక్రాంతి, రంజాన్ కానుకలు ఇస్తామని కూటమి నేతలు ఎన్నికల్లో హామీలనిచ్చిన వైనాన్ని కార్డుదారులు గుర్తు చేసుకుంటున్నారు. సంక్రాంతి పోయింది... రంజాన్ వస్తోంది. కానుకల ప్రస్తావనే వినిపించటం లేదంటున్నారు. అన్ని రకాల పప్పులు పంపిణీ అటుంచి, ప్రతినెలా ఇచ్చే సరుకులనే సక్రమంగా ఇవ్వకపోవటాన్ని ప్రజలు విమర్శిస్తున్నారు. నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆకస్మిక తనిఖీల సందర్భంగా ఎంఎల్ఎస్ పాయింట్లలో పంచదార ప్యాకింగ్‌లో తూకం తక్కువగా ఉందన్న కారణంగా పంపిణీ నిలిపివేసిన వైనం తెలిసిందే. ఆ విధంగా అప్పట్లో రెండుమూడు నెలలు పంచదార ఇవ్వనే లేదు. మళ్లీ ఇప్పుడు వరుసగా మండలంలో 20 గ్రామాలలోని 18,601 రేషన్ కార్డుదారులకు మూడు నెలల పాటు రేషన్ వాహనాల ద్వారా బియ్యం, అరకొర పంచదార మినహా మిగిలిన సరుకులు ఇవ్వడం లేవు. మార్చి నెలలోనూ ఇదే తరహాలో పంపిణీ చేశారు. గత నెలలో మాకు పంచదార ఇవ్వలేదు... గత నెల, ఈనెల కలపి రెండు నెలలకు పంచదార ఇవ్వాలని, కందిపప్పు నిజంగానే రాలేదా? అంటూ కార్డుదారులు ఎండీయూ వాహనాల ఆపరేటర్లను నిలదీస్తున్నారు. మాకు స్టాకు వస్తే మేమెందుకు ఇవ్వమంటూ ఆపరేటర్లు సమాధానమిస్తున్నారు.

ఒకరిపై ఒకరు...

కందిపప్పు పంపిణీ విషయమై ఫోన్‌లో అధికారులును వివరణ కోరగా వారు ఒకరిపై ఒకరు చెప్పుకున్నారు. తొలుత మండలంలోని డిప్యూటీ తహసీల్దారుని ప్రశ్నించగా ఆయన తాను కాదు.. సివిల్ సప్లయీస్ ఆర్ఐ ని వివరణ తీసుకోమని సూచించారు. తీరా, ఆయన కూడా 'నేను పేపరుకు వివరణ ఇవ్వడానికి సరిపోననీ, మీరు డీఎస్‌వో' ని అడగాలంటూ సమాధానమిచ్చారు. డీఎస్‌వోకి ఫోన్ చేయగా తాను ముఖ్యమంత్రి సమావేశంలో ఉన్నానని బదులిచ్చారు.

పేదలపై చిన్నచూపు

రాష్ట్రంలో మూడు పార్టీలు కలసి ఎన్నికల్లో నిలబడి అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టి 9 నెలలు దాటినా హామీలు పూర్తిగా అమలు చేయలేదు.ప్రతినెలా పేదలకు అందించే రేషన్ సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయలేక పోతున్నారు. జనవరి నుంచి కందిపప్పు, పంచదార లేదు, మార్చిలో బియ్యం, పంచదార మాత్రమే అందించారు. ఇప్పటికైనా పేదలకు అందించే రేషన్ సరుకులు ప్రతినెలా పూర్తిస్థాయిలో అందించేలా చర్యలు తీసుకోవాలి.

– ఎ.నరసమ్మ, తూములూరు, కొల్లిపర మండలం

క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్సీ సాయం



తెనాలిరూరల్: అగ్నిప్రమాద బాధితులకు ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆర్థిక సాయం అందించారు. మండలంలోని జగ్గడిగుంటపాలెం గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఆలపాటి శనివారం బాధితులను పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున సాయం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు మహమ్మద్ ఖుద్దూస్ ఇతర నాయకులు ఉన్నారు.

కేంద్రీయ విద్యాలయానికి దరఖాస్తు చేసుకోండి

తెనాలిఅర్బన్: స్థానిక జగ్గడిగుంటపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో 2025–26 సంవత్సరానికి సంబంధించిన బాల వాటిక–3 (బీవీ–3), 1వ తరగతి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని ప్రిన్సిపల్ కె.శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీలోపు అర్హులైన విద్యార్థులు అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కేంద్రీయ విద్యాలయ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రతీ పుట్టిన రోజున అందరూ మొక్కలు నాటాలి



కొల్లిపర: ప్రతి ఒక్కరూ వారి జీవితంలో వచ్చే పుట్టిన రోజున మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని తద్వారా వాతావరణంలో కాలుష్యం సమస్యలు రాకుండా, ప్రకృతి వైపరీత్యాలు జరగకుండా నివారించవచ్చు అని ఎంఈవో2 ఝాన్సీలత అన్నారు. శనివారం స్థానిక హైస్కూల్‌లో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర అనే కార్యక్రమం నిర్వహించి, విద్యార్థుల చేత ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు నాటడం వల్ల కలుగు ప్రయోజనాలు, ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను వివరించారు. ఉపాధ్యాయులు సత్య సువాసిని, అనంతలక్ష్మి, నాగరాజ కుమారి, నాగవరలక్ష్మి, సీఆర్ఎంటి పిడపర్తి రమేష్‌బాబు పాల్గొన్నారు.

గంజాయి తాగుతున్న యువకులపై కేసు

తెనాలిరూరల్: గంజాయి తాగుతున్న యువకులపై కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వీఎస్సార అండ్ ఎన్‌వీఆర్ కళాశాల సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో గంజాయి తాగుతున్నారన్న సమాచారంతో టూ టౌన్ పోలీసులు శనివారం ఆకస్మిక దాడులు చేశారు. గంజాయి తాగుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయిని స్వాధీనపర్చుకున్నారు. మరో ఇద్దరు యువకులు పరారయ్యారు. నిందితులంతా ఐతానగర్‌కు చెందిన వారిగా గుర్తించారు.

కాకినాడ యువకుడు తెనాలిలో అదృశ్యం!



నూకరాజు(ఫైల్)

తెనాలిరూరల్: కాకినాడ సమీపంలోని సూర్యారావుపేటకు చెందిన యువకుడు తెనాలిలో అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. యువకుడి కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సూర్యారావుపేటకు చెందిన 29 ఏళ్ల తీరిది నూకరాజు కొద్ది రోజుల క్రితం రేపల్లె సమీపంలోని నిజాంపట్నంకు తన స్నేహితుడితో కలసి చేపల వేట కోసం వచ్చాడు. ఈ నెల 10వ తేదీన బస్సులో తెనాలికి చేరుకున్నారు. తెనాలిలో రాత్రి మద్యం సేవించి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రపోయారు. మరునాడు ఉదయం నుంచి నూకరాజు కనబడకపోవడంతో స్నేహితుడు స్వగ్రామం వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు నూకరాజు ఆచూకీ వెతుక్కుంటూ శనివారం తెనాలి వచ్చారు. ఇక్కడి జీఆర్పీ, త్రీ టౌన్ పోలీసులను ఆశ్రయించారు. ఆచూకీ తెలిసిన వారు 9959900902, 9963229610 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు



తెనాలిఅర్బన్: ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ముగిశాయి. ప్రథమ సంవత్సర పరీక్షలు ఈ నెల 1న, ద్వితీయ సంవత్సర పరీక్షలు ఈ నెల 3వ తేదీ నుంచి ప్రారంభమైన విషయం తెలిసిందే. పట్టణంలోని 12 పరీక్ష కేంద్రాల్లో వీటిని నిర్వహించారు. మొదటి సంవత్సర పరీక్షలు గురువారంతో, ద్వితీయ సంవత్సర పరీక్షలు శనివారంతో ముగిశాయి.

కమ్యూనిజంపై సువార్తమ్మకు విప్లవప్రేమ

సంస్మరణ సభలో ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూపరాణి



సువార్తమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న వివిధ సంఘాల నేతలు

తెనాలి: కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలంగా పనిచేసిన వేము సువార్తమ్మకు కమ్యూనిజంపై విప్లవప్రేమ ఉందని ప్రొపెసర్ చల్లపల్లి స్వరూపరాణి అన్నారు. ఈనెల ఒకటో తేదీన మృతిచెందిన కమ్యూనిస్టు పార్టీ క్రియాశీల నేత వేము సువార్తమ్మ సంస్మరణ శనివారం స్థానిక అయితానగర్‌లో జరిగింది. సభకు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ అధ్యక్షత వహించారు. చల్లపల్లి స్వరూపరాణి మాట్లాడుతూ ఆరోజుల్లో దళితవాడల్లో ప్రతి ఇంటిలోనూ కమ్యూనిస్టులు ఉండేవారని చెప్పారు. వారిని విస్మరించలేని సువార్తమ్మ భర్తకు తోడుగా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసిందన్నారు. బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ ఆనాడు పల్లెలే కమ్యూనిస్టులకు కంచుకోటలుగా ఉండేవన్నారు. సమస్త దోపిడీ నుండి వారిని రక్షించేది కమ్యూనిస్టులేనని నమ్మారని చెప్పారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ కమ్యూనిస్టుల త్యాగాలకు వెలకట్టలేమన్నారు. రామసుబ్బయ్య, సువార్తమ్మ స్మారకంగా అయితానగర్‌లో స్థూపం ఏర్పాటుచేస్తామని చెప్పారు. సీపీఎం తెనాలి కార్యదర్శి కొల్లిపర బాబూప్రసాద్, రైతుకూలి సంఘ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, ఈశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, బేతాళ ప్రసాద్, డాక్టర్ పిల్లి వాసు, గుంటి సురేష్, బేతాళ కృష్ణమోహన్, మేకతోటి ప్రభాకర్ మాట్లాడారు. తొలుత సువార్తమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ప్రజానాట్యమండలి కళాకారులు ఆరెటి రామారావు, దేవరకొండ శ్రీను, నీలాంబ్రం గేయాలను ఆలపించారు.

తిరుమలకు పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పాదయాత్ర ఆరంభం



తిరుమలకు మహాపాదయాత్రగా బయలుదేరిన బాలస్వామీజీ

తెనాలి: శ్రీవాసవీ పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సరస్వతిస్వామి (బాల స్వామీజీ) తెనాలి నుంచి తిరుమలకు మహాపాదయాత్ర శనివారం తెల్లవారు జామున నాలుగున్నర గంటలకు ప్రారంభ మైంది. స్థానిక గంగానమ్మ పేటలోని శ్రీవిద్యాపీఠం, శ్రీసాలిగ్రామ మఠం ట్రస్ట్ నుంచి ఆరంభించిన పాదయాత్రలో ముందుగా గంగానమ్మ గ్రామదేవతను బాలస్వామీజీ దర్శించుకున్నారు. తదుపరి తెనాలి సరిహద్దుల్లోని శ్రీలక్ష్మీ పద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయం వైకుంఠపురంను సందర్శించారు. అక్కడి వేదపండితులు, ఆలయ ఈవో అనుపమ ఆధ్వర్యంలో బాల స్వామీజీకి పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. తదుపరి తనను అనుసరించి వస్తున్న భక్తులతో కలిసి శ్రీ బాలస్వామీజీ అక్కడి నుంచి బయలుదేరి పెదరావూరు, కూచిపూడి, పెదపూడి, అమృతలూరు మీదుగా సాయంత్రానికి గోవాడ చేరుకున్నారు. అక్కడ గడ్డిపాటి శ్రీనివాసరావు–ఉషారాణి నివాసంలో శ్రీవారి కల్యాణం నిర్వహించారు. మహా పాదయాత్రకు ముందుగా శుక్రవారం రాత్రి గంగానమ్మపేటలోని శ్రీసాలిగ్రామం మఠం, శ్రీవిద్యాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణం జరిపారు. 400 మంది మహిళలకు పసుపు కుంకుమ, గాజులు, వడిబియ్యాన్ని బాలస్వామీజీ ఇచ్చారు. కార్యక్రమంలో సాలిగ్రామం మఠం ట్రస్ట్ అధ్యక్షుడు నంబూరు వెంకట కృష్ణమూర్తి, రావూరి సుబ్బారావు, గోపు రామకృష్ణ, ముద్దాభక్తుని రమణయ్య, చుండూరు లోకనాథం, వై.రాజేశ్వరరావు, జయలక్ష్మి మాతృమండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిరోజూ శ్రీవారి కల్యాణం

ఇటీవల పెనుగొండ పీఠాధిపతిగా పట్టాభిషేకం జరుపుకున్న శ్రీప్రజ్ఞానంద సరస్వతి స్వామి (శ్రీబాలస్వామీజీ) సకల జనుల శ్రేయస్సు, లోకకల్యాణం, రైతు క్షేమార్థం తెనాలి నుంచి తిరుమలకు మహాపాదయాత్ర చేపట్టారు. ప్రతిరోజు తెల్లవారుజామున నాలుగు గంటలకు యాత్రను ఆరంభించి, 20 కిలోమీటర్ల చొప్పున పాదయాత్ర చేసేలా ప్రణాళికను నిర్ణయించుకున్నారు. ప్రతిరోజూ సాయంత్రం ఆరుగంటలకు శ్రీవారి కల్యాణోత్సవం జరుపనున్నారు. తిరుమలలో శ్రీవారి కల్యాణం తరహాలోనే ఈ కల్యాణాన్ని జరుపుతామని నిర్వాహకులు తెలియజేశారు. 16న కర్లపాలెం, 17న ఈపూరుపాలెం, 18న వేటపాలెం, 19న ఉప్పుగుండూరు, 20న ఒంగోలు, 21న టంగుటూరు, 22 సింగరాయకొండ, 23న మోచర్ల, 24న కావలి, 25 ఉలవపాళ్ల, 26న కమ్మపాలెం, 27న నెల్లూరు,28న వెంకటాచలం, 29న గూడూరు, 30న గొల్లపల్లి, 31న బంగారుపేట, ఏప్రిల్ 1న వాంపల్లి శ్రీకాళహస్తి మండలం, 2న దుర్గిపేరి, 3న రేణిగుంట, 4న తిరుపతిలో శ్రీవారి కల్యాణాలు జరుగుతాయి. ఏప్రిల్ 12న తిరుమలలోని ఆస్థానమండపంలో శ్రీవేంకటేశ్వర గానామృత పారాయణం వెయ్యిమందితో ఏర్పాటుచేశారు. తదుపరి దర్శనం, పున్నమి గరుడసేవ దర్శనం వంటి కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

గతంలో కాశీకి పాదయాత్ర...

లలిత సేవాసమితి నిర్వాహకుడిగా ఉన్న రోజుల్లో బాలస్వామీజీ తెనాలి నుంచి కాశీకి పాదయాత్ర చేశారు. అప్పట్లో ఇక్కడ నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం దిగ్విజయం కావటంతో పాదయాత్ర చేపట్టారు. వైశాఖమాసంలో హనుమత్ జయంతి నాటికి కాశీకి చేరుకుని అక్కడ లక్ష తమలపాకులతో నాగదళార్చన, పూజలు చేశారు. మళ్లీ ఇప్పుడు తిరుమలకు మహాపాదయాత్ర చేపట్టారు. బాలస్వామీజీతో పాదయాత్రలో పాల్గొనేవారు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనాలని సూచించారు.

క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోండి



మెడల్స్ అందజేస్తున్న నేషనల్ రిఫరీ వాగ్దేవి

తెనాలిఅర్బన్: క్రీడలపై ఆసక్తిని పెంపొందించుకోవాలని రాష్ట్ర తైక్వాండో అకాడమీ అధ్యక్ష కార్యదర్శులు పి.బాలకృష్ణ, పి.సుబ్బారావులు పేర్కొన్నారు. ఆత్మకూరు తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో చెంచుపేట, అమరావతి ప్లాట్స్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో శనివారం జిల్లాస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 259 మంది క్రీడాకారులు ఇందులో పాల్గొన్నారు. గెలుపొందిన వారికి మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో నేషనల్ రిఫరీ కె.వాగ్దేవి, నేషనల్ మెడలిస్ట్స్ ముకేష్, అఖిల్ పాల్గొన్నారు.

విద్యతోనే సంపూర్ణ జీవితం

అరబిందో విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ



తెనాలిటౌన్: విద్యతోనే సమాజంలో ఉన్నతంగా రాణించగలమని అరబిందో విద్యాకేంద్రం డైరెక్టర్ కె.సంపూర్ణ పేర్కొన్నారు. స్థానిక నాజర్‌పేటలోని అరబిందో విద్యాకేంద్రం 44వ వార్షికోత్సవ వేడుక శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పూర్వ విద్యార్థి డాక్టర్ మురళీధర్ పాల్గొని మాట్లాడారు. చైతన్యవంతమైన సమాజం సాధ్యపడాలంటే ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యతో సమాజాభివృద్ధి, కుటుంబ అభివృద్ధి సాధ్యపడుతుందని స్పష్టం చేశారు. విద్యార్థి దశలో పాఠశాలలో చదువుకున్న అనుభవాలను నెమరవేసుకున్నారు. ప్రతి విద్యార్థి జీవితం తెరచిన పుస్తకమన్నారు. తల్లిదండ్రులు, గురువులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని చదువుపై అంకిత భావం కనబరచాలని కోరారు. ఈ సందర్భంగా నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. అతిథులకు, వక్తలకు పాఠశాల యాజమాన్యం మెమొంటోలు బహూకరించారు. 2024–25 సంవత్సరానికి ఆల్‌రౌండ్ పర్సనాలిటీ గల విద్యార్థులకు, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు దాతలు అందించిన విరాళాలతో స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తాడిబోయిన అవినాష్, వి.అనిల్‌కుమార్, డాక్టర్ పి.రాకేష్, డాక్టర్ టి.అఖిలేష్, విద్యాకేంద్రం హెడ్ మిస్సెస్ ఆర్.నిర్మలకుమారి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత తెనాలిగా రూపకల్పన చేద్దాం



మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



మహిళకు పంచదార పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

- అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్
- మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ సేకరణ కేంద్రం

తెనాలిఅర్బన్: ప్లాస్టిక్ రహిత తెనాలి రూపకల్పనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని అసిస్టెంట్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం నుంచి ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ వస్తువులు సేకరణ కేంద్రాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను ప్రభుత్వం నిషేధించిందని చెప్పారు. 120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న వస్తువులను నిషేధించడం జరిగిందన్నారు. ప్రజలందరూ సహకరిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్నలు మాట్లాడుతూ తెనాలి పట్టణంలో ప్లాస్టిక్ వస్తువులు, కవర్ల సేకరణ కోసం శనివారం మార్కెట్ వద్ద ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కేజీ ప్లాస్టిక్‌ను ఇచ్చిన వారికి కేజీ టమోటా, కేజీ పంచదార, కేజీ సేమ్యా, ఆరు కోడి గ్రుడ్లు, అరలీటరు పాలలో ఒక వస్తువును పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

తెనాలి పట్టణంలో ఇప్పటికే పలు షాపులపై దాడులు చేసి 120 మైక్రాన్‌ల తక్కువ మందం ఉన్న కవర్లను, వస్తువులను సీజ్ చేయడం జరిగిందన్నారు. తక్కువ మందం ప్లాస్టిక్ వస్తువులు విక్రయించిన, ఉపయోగించిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ కమిషనర్ వీఎం లక్ష్మీపతిరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల స్థానంలో జనపనార, క్లాత్ సంచులను ఉపయోగించాలని సూచించారు. ప్లాస్టిక్ బాటిల్స్ కూడా ఎంతో ప్రమాదకరమని చెప్పారు. ఇవి పర్యావరణానికి హానీ కలిగిస్తాయని వివరించారు. అనంతరం కేజీ ప్లాస్టిక్ వస్తువులు ఇచ్చిన వారికి వారు కోరిన వస్తువును పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గోగిరెడ్డి మానసరెడ్డి, కొమరబత్తిని జయపాల్, గొడవర్తి శ్రీ సాయి హరేరామ్, తాడిబోయిన బ్రహ్మేశ్వరరావు, అన్నం పిన్నారావు, దాసరి వసంతరావు, దేసు యుగంధర్, పెదలంక లక్ష్మీలావణ్య, పలు విభాగాల మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వైద్యశాలలో ఆకట్టుకున్న నాటిక

స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో సోమవారం ప్లాస్టిక్ నిషేధ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలన్నారు. తక్కువ రకం ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వలన అనేక అనార్థలు ఉన్నాయని చెప్పారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గుంటూరులోని ప్రియదర్శిని ఫార్మసీ కళాశాలలో ఫార్మ డీ చదువుతున్న విద్యార్థులు ప్లాస్టిక్ నిషేధంపై ప్రదర్శించిన నాటిక పలువురిని ఆకట్టుకుంది. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్, పలువురు వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధార్మిక చింతనతోనే సమాజంలో శాంతిస్థాపన



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

తెనాలిటౌన్: ధార్మికచింతనతో సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి దేవస్థానం అర్చకులు రొంపిచర్ల మారుతీ చక్రవర్తి పేర్కొన్నారు. స్థానిక బోసురోడ్డులోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం కన్నుల పండువగా ప్రారంభమయ్యాయి. ఉదయం స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యాహం, గో పూజ, శ్రీ స్వామివారి మూలమూర్తికి విశేష అభిషేకం, స్వామివారిని పెండ్లి కుమారుడిని చేసి విశేష పూజలు నిర్వహించారు. దంపతులు వ్రత మహోత్సవంలో పాల్గొన్ని పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. 16వ తేదీ కుంభారాధన, స్వామివారి తిరుకళ్యాణం, మహాశాంతి హోమం, ఊరేగింపు, 17వ తేదీ పూర్ణాహుతి, కుంభాభిషేకం, ధ్వజారోహణ, పవలింపు సేవ, మహాదాశీర్వచనం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యమే మన ధ్యేయం

ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్



డిపో ఆవరణను శుభ్రం చేస్తున్న మేనేజర్ రాజశేఖర్

తెనాలిఅర్బన్: స్వచ్ఛ ఆంధ్ర సాధనే మన లక్ష్యంగా అందరూ పనిచేయాలని తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. స్వచ్ఛ దివాస్ కార్యక్రమంలో భాగంగా శనివారం డిపో ఆవరణను ఊడ్చి శుభ్రం చేశారు. అనంతరం అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతామనే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల మూడోవ శనివారం స్వచ్ఛా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

\+ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని పాత ప్రభుత్వ వైద్యశాలలోని సహాయ మలేరియా అధికారి కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంచి సమాజాని నిర్మించేందుకు స్వచ్ఛ దివాస్ కార్యక్రమం దోహదపడుతుదని చెప్పారు.

ఘనంగా నగరేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీ వింధ్య వాసినీ అమ్మవారు

తెనాలిటౌన్: స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో వేంచేసి యున్న శ్రీ వింధ్య వాసినీ సమేత నగరేశ్వరస్వామి వార్ల అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలను శనివారం కన్నుల పండవగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.30 గంటలకు స్వామివార్లకు సూప్రభాత సేవ, నిత్య అర్చనలు, గణపతి పూజ, పంచగవ్య ప్రసనం, దీక్షధారణం, అఖండ దీపస్థాపన, శ్రీ విజయ గణపతి పంచామృతాభిషేకం, తీర్థప్రసాద వినియోగం గావించారు. సాయంత్రం సామూహిక లలిత సహస్ర పారాయణం, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపనం, మూర్తి హోమములు, మూలమంత్ర హోమములు, ధ్వజరోహణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించి తీర్థప్రసాదాలు సేకరించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో బ్రహ్మోత్సవాలు సందడిగా నిర్వహించారు. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి మహాదేవుని దర్శించి దివ్యాశీస్సులు కలగలని దేవస్థాన కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలకంటి గంగాధరరావు కోరారు. ఈ నెల 17వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలియజేశారు. 16వ తేదీ ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, శ్రీసూక్త, దుర్గసూక్త, మణ్యు సూక్త, ఆదిత్యాది నవగ్రహ హోమం నిర్వహిస్తారని తెలిపారు. 17న శ్రీవాసవీ అమ్మవారికి పంచామృతాభిషేకం, అర్చనలు, త్రిశూల స్నానం, రథాంగ హోమం, దివ్య రథోత్సవం జరుగుతాయని వెల్లడించారు. భక్తులు విశేషంగా విచ్చేసి ఆధ్యాత్మిక కార్యక్రమాలకు జయప్రదం చేయాలని ఆలయ అర్చకులు నుదురుపాటి రామకోటేశ్వర శర్మ, మల్లంపల్లి రామలింగశర్మ కోరారు.

బాలుడి అదృశ్యంపై కేసు నమోదు

మేడికొండూరు: బాలుడి అదృశ్యంపై మేడికొండూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పేరేచర్ల తెల్ల క్వారీ వడ్డెర కాలనీకి చెందిన 15 సంవత్సరాల తిరుపతి వెంకటేష్ శుక్రవారం సాయంత్రం తన తల్లి మందలించిందని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. బంధుమిత్రులు, స్నేహితులు, తెలిసిన వారిని విచారించినా.. తండ్రి నాగేశ్వరావుకు ఆచూకీ లభించలేదు.దీంతో అతను పోలీసులను ఆశ్రయించాడు. ఆచూకీ తెలిసిన వారు పీఎస్ ఎస్‌హెచ్‌ఓ మొబైల్ నంబరు 8688 831380, పీఎస్ ల్యాండ్ నంబరు 08641 239233, ఎస్ఐ సెల్ నెంబర్ 75695 24727కు తెలియజేయాలని తెలిపారు.